ప్రచురణ తేదీ : 06-22-2021 రచయిత పేజీని సమర్పించినవారు:

# నేతల ప్రతాప్ కుమార్

## కవి గురించి...

శ్రీ నేతల ప్రతాప్‌కుమార్ ప.గో.జిల్లా నిడదవోలు మండలం విజ్జేశ్వరం గ్రామంలో శ్రీ నేతల సత్యం, శాంతకుమారి పుణ్యదంపతులకు ది. 13-8-1965న జన్మించారు. పద్మావతి వీరి అర్ధాంగి. సత్యాన్వేష్, రాహుల్‌రాజ్, సాహితి వీరి సంతానం.

ప్రాథమిక విద్య విజ్జేశ్వరంలోను, ప్రాథమికోన్నత విద్య పురుషోత్తపల్లి, నిడదవోలుల లోను అభ్యసించారు. ప.గో.జిల్లా భీమవరం డి.ఎన్.ఆర్. కళాశాలలో ఇంటర్ మీడియట్, అత్తిలి, పెనుగొండ, డిగ్రీ కళాశాలల్లో బిఎ, రాజమండ్రి ప్రభుత్వ కళాశాలలో ఎం.ఎ(తెలుగు), రాజమండ్రి ప్రభుత్వ కాంప్రహెన్సివ్ కళాశాలలో తెలుగు పండిట్ శిక్షణ పొంది, ఏలూరు సి.ఆర్.రెడ్డి న్యాయ కళాశాలలో న్యాయవిద్యను అభ్యసించారు.

కొంతకాలం జర్నలిస్టుగా, జూనియర్ కాలేజి లెక్చరర్‌గా (రేలంగి కో-ఆపరేటివ్ జూనియర్ కాలేజీ), డిగ్రీ కాలేజి లెక్చరర్‌గా (గోయంక ఉమెన్స్ డిగ్రీ కాలేజ్, తాడేపల్లి గూడెం) పనిచేశారు. ప్రస్తుతం ఎస్.ఎన్.వి.జడ్.పి.హెచ్.స్కూల్, ముక్కామల (ప.గో.జిల్లా)లో తెలుగు భాషోపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

విద్యార్థి దశలో దళిత మహాసభలోను, హేతువాద సంఘంలోను పనిచేశారు. 2001లో తణుకులో అంబేడ్కర్ సాహిత్య అకాడమీ స్థాపించి, ప్రతి ఏటా దళిత కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. కొంతకాలం దళిత చర్చావేదిక నిర్వహించారు. భారతీయ దళిత సాహిత్య అకాడమీ, పశ్చిమగోదావరి జిల్లా శాఖకు 2001 నుంచి అధ్యక్షులుగా ఉన్నారు.

అంబేడ్కరిజాన్ని సాహిత్యం ద్వారా ప్రచారం చేయాలనేది ఈయన ఆకాంక్ష. బహుజన రాజ్యాధికారం అంబేడ్కరిజం వ్యాప్తి ద్వారానే వస్తుందనేది ప్రగాఢ విశ్వాసం.

వీరి రచనలు 'పాలకంకి'(2003), 'దళిత నానీలు'(2005), 'అన్నంగిన్నె'(2006,2007,2009) 'పిల్లల కోసం అంబేడ్కర్ కథ'(2007,2008), బౌద్ధభాషితాలు (2008)